సాక్షి
నల్లగొండ
శనివారం । 22 । మార్చి । 2025



పోచంపల్లిలో 'ఫ్యాషన్' విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లిని శుక్రవారం హైద రాబాద్‌కు చెందిన ఫ్యాషన్ డిజైనర్ విద్యార్థులు సందర్శించారు.

- 8లో



ఇద్దరు అరెస్ట్

యువతిని లైంగికంగా వేధించిన ఇద్దరిని అరెస్టు చేసినట్టు హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు తెలిపారు.

- 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-32 (శుక్రవారం సా॥)

సహర్ 4-57 (శనివారం ఉ॥)

న్యూస్‌రీల్

జీజీహెచ్‌లో వార్డుల తనిఖీ



రోగులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ అరుణకుమారి

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లోని వార్డులను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులను పలుకరించి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగుల అభిప్రాయాలతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించడానికి వైద్యులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అన్వేష్, పాల్గొన్నారు.

సర్వీస్ రూల్స్‌పై ఉద్యోగులకు అవగాహన



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

నల్లగొండ : పంచాయతీరాజ్ శాఖలో కారుణ్య నియామకాల కింద జూనియర్ అసిస్టెంట్లుగా నియమితులైన ఉద్యోగులకు శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో సర్వీస్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఉద్యోగాలు పొందిన వారు అన్ని రూల్స్ తెలుసుకుని ఉద్యోగంలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ బి.శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పు రాంబాబు, నాయకులు కె.నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవోత్సవం



ఆండాళ్‌దేవికి పూజలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్టింపజేసి ఊంజల్ సేవ నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన నాధ స్వరం వినిపించారు. ఇక ప్రధానాలయంలోనూ సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవ, గర్భాలయంలో స్వయంభూలకు అభిషేకం, అర్చన, ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, ఉత్సవామూర్తులకు నిత్యకల్యాణంతో పాటు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

అందాల భామలకు ఆతిథ్యం!

ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించనున్న మిస్‌వరల్డ్ పోటీదారులు

- మే 12న నాగార్జునసాగర్‌కు, 15న పోచంపల్లి, యాదగిరిగుట్టకు రానున్న ప్రపంచ సుందరీమణులు
- ఇక్కడి ప్రాంతాలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చేలా తెలంగాణ పర్యాటకశాఖ ప్రణాళిక

భూదాన్‌పోచంపల్లి, యాదగిరిగుట్ట, నాగార్జునసాగర్

అందాల భామలకు అతిథ్యమిచ్చేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లా సిద్ధమవుతోంది. హైదరాబాద్‌లో మే 7 నుంచి 31 వరకు 72వ ఎడిషన్ మిస్ వరల్డ్–2025 పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ పోటీలకు 140 దేశాల నుంచి మూడు వేల మంది అందాల భామలు, విదేశీ ప్రతినిధులు హాజరుకానున్నారు. వారిద్వారా హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పర్యాటక కేంద్రాలకు అంతర్జాతీయంగా గుర్తింపు తీసుకొచ్చేందుకు తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రణాళిక రూపొందిస్తోంది. అందులో భాగంగా అందాల భామలు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని భూదాన్‌పోచంపల్లి, యాదగిరిగుట్ట, నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని సందర్శించనున్నారు. ఇలా వివిధ దేశాల అందాల భామలను గ్రామీణ ప్రాంతాలకు తీసుకురావడం ద్వారా ఆయా ప్రాంతాలకు అంతర్జాతీయంగా ప్రాచుర్యం కల్పించాలన్నది ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం.

మే 15న ఇక్కత్ వస్త్రాలతో ర్యాంప్‌వాక్..

ఇక్కత్ వస్త్రాలకు అంతర్జాతీయంగా పేరుగాంచిన భూదాన్‌పోచంపల్లికి మిస్‌వరల్డ్ పోటీల్లో పాల్గొనే అందాల భామలు మే 15వ తేదీన రానున్నారు. వీరు ఇక్కడి చేనేత కార్మికులతో ముఖాముఖి మాట్లాడుతారు. అనంతరం మగ్గాలపై చేనేత వస్త్రాల తయారీ ప్రక్రియలను పరిశీలిస్తారు. తరువాత చేనేత చీరలు ధరించి ర్యాంప్‌వాక్ చేసేలా కార్యక్రమాన్ని రూపొందించారు. మిస్‌వరల్డ్ పోటీల ఈవెంట్లను నిర్వహించే పోచంపల్లి ఇక్కత్‌వస్త్రాల విశిష్టతను వీడియోగ్రఫీ చేస్తున్నారు. ఫలితంగా చేనేత ఉత్పత్తులకు అంతర్జాతీయంగా మరింత పేరును తీసుకురావడమే ఈవెంట్ల ముఖ్య ఉద్దేశమని తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ పేర్కొంటోంది. ఇప్పటికే అనేక ఫ్యాషన్ ఈవెంట్లకు వేదికైన పోచంపల్లికి ఇప్పుడు మరోసారి ప్రపంచ సుందరీమణులు వస్తుండడంతో ఈ ప్రాంతం అంతర్జాతీయ ఖ్యాతి పొందనుంది.



పోచంపల్లిలో మిసెస్ ఏషియా ఇంటర్నేషన్ వరల్డ్ విన్నర్ మమత త్రివేది ర్యాంప్ వాక్ (ఫైల్)

ఇటీవలే యాదగిరి క్షేత్రాన్ని సందర్శించిన మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్కోవా

ఇటీవల యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాన్ని మిస్ వరల్డ్ -2024 క్రిస్టినా పిస్కోవా సందర్శించారు. ఆలయం అద్భుతమని కొనియాడారు. వాస్తు శిల్పం, ప్రశాంతమైన పరిసరాలు, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత కోసం యాదగిరి క్షేత్రాన్ని తప్పనిసరిగా సందర్శించాల్సిన ప్రదేశమని ఆమె పేర్కొన్నారు. ఆమె ప్రకటనతో మే 15న మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే అందెగత్తెలంతా యాదగిరి క్షేత్ర సందర్శనకు వచ్చి, ఆధ్యాత్మిక అనుభూతిని పొందనున్నారు.



ఈ నెల 18న యాదగిరి క్షేత్రంలో క్రిస్టినా పిస్కోవా

విజయ విహార్‌లో విడిది



ప్రపంచదేశాల బౌద్ధులను ఆకర్షించేందుకు నాగార్జునసాగర్‌లోని కృష్ణానది తీరంలోని బుద్ధవనాన్ని ప్రపంచ అందెగత్తెలు మే 12న సందర్శనున్నారు. బౌద్ధుల చరిత్ర, ఈ ప్రాంత ప్రాశస్త్యాన్ని వారు తెలుసుకోనున్నారు. వారికి ఇక్కడి బౌద్ధసంస్కృతిని పరిచయం చేయడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక ప్రాంతంగా గుర్తింపు దక్కేలా తెలంగాణ పర్యాటక శాఖ ఏర్పాట్లు చేస్తోంది. మిస్‌వరల్డ్ పోటీదారులు సాగర్‌లో ఇక్కడ విడిది చేయడానికి గాను విజయవిహార్‌లోని గదులను ఆధునీకరిస్తున్నారు. రూ.5 కోట్ల వ్యయంతో అన్ని హంగులు కల్పిస్తున్నారు. ఇప్పటికే ఆయా పనులు ప్రారంభించారు. వారి విడిదికి సకల హంగులు కల్పిస్తూ.. విజయ విహార్ వాతావరణం ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నారు. వీరి పర్యటన నేపథ్యంలో శనివారం తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ, నల్లగొండ కలెక్టర్, ఉన్నతాధికారులు నాగార్జున సాగర్‌లోని బుద్ధవనంలో సమావేశం నిర్వహించనున్నారు.

ఆధ్యాత్మిక నగరికి..

మే 15వ తేదీనే అందాల భామలు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకోనున్నారు. మధ్యాహ్నం 12గంటల నుంచి 2 గంటల వరకు ఇక్కడ గడపనున్నారు. వారు 15వ తేదీన హైదరాబాద్ నుంచి నేరుగా యాదగిరికొండకు దిగువన ఉన్న ప్రెసిడెన్షియల్ సూట్‌కు చేరుకుని.. అక్కడి నుంచి యాదగిరి క్షేత్రానికి వస్తారు. విష్ణు పుష్కరిణిలో సంకల్ప పూజలు చేసి, ప్రధానాలయం సమీపంలో ఉన్న అఖండ దీపారాధన పూజల్లో పాల్గొంటారు. శ్రీస్వామి వారి దర్శనం తర్వాత ప్రధానాలయ పునః నిర్మాణాన్ని మిస్ వరల్డ్ పోటీ దారులు పరిశీలించి, ఇక్కడే ఒక డాక్యుమెంటరీ సైతం చేయనున్నట్లు తెలుస్తోంది. మిస్ వరల్డ్ పోటీదారులతో యాదగిరిక్షేత్ర వైభవం ప్రపంచ స్థాయికి వెళ్లనుంది.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నాంపల్లి : గ్రామాల్లో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శుక్రవారం ఆమె నాంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. రాత్రి వేళ రోగులకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. అనంతరం స్థానిక కస్తూరిభా గాంధీ విద్యాలయాన్ని తనిఖీ చేశారు. డైనింగ్ హాల్, వంట గదులను పరిశీలించారు. హాస్టల్, పాఠశాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ దేవ్‌సింగ్, ఎంపీడీఓ శ్రీనివాసశర్మ, వైద్యులు భవాని, తరుణ్, ఎంపీఓ ఝాన్సీ, సూపర్‌వైజర్ అంజలి ఉన్నారు.



నాంపల్లి ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రాయితీపై ప్రచారం చేస్తాం

నల్లగొండ : ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 25 శాతం డిస్కౌంట్‌పై మరోసారి ప్రచారం చేస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఇప్పటికే రెండుసార్లు లే అవుట్ డెవలపర్స్‌తో సమావేశాలు నిర్వహించామని తెలిపారు. 1002 మంది ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు ఫీజు చెల్లించారని, వారికి ప్రొసీడింగ్స్ ఇచ్చామన్నారు. చిన్న చిన్న సమస్యలను అధిగమించి రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువు ఈ నెల 31వ తేదీలోగా నూరు శాతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీపీఓ వెంకయ్య, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

తాగునీటి పనులకు రూ.5.10 కోట్లు విడుదల

నల్లగొండ : వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకుగాను బోర్లు, చేతిపంపులు, పైపులైన్లు, ట్యాంకుల మరమ్మతు పనులకు డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి 5 కోట్ల 10 లక్షల రూపాయలు విడుదలైనట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 827 తాగునీటి పనులను ఎంపీడీఓలు పర్యవేక్షించాలని, పనులు చేపట్టే ముందు పూర్తి అంచనాలు తయారుచేసి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. పనులు పూర్తయిన తర్వాత ఫొటోలతో సహా బిల్లులు సమర్పించాలని పేర్కొన్నారు. ఎక్కడా తాగునీటికి సమస్య రాకుండా చూడాలని ఆదేశించారు.

సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టొద్దు : ఎస్పీ

నల్లగొండ : ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టేలా సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టే వారిపై నిరంతరం నిఘా ఉంచుతామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక మాధ్యమాలైన వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగాం, యూట్యూబ్‌లలో ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు, విద్వేష పూరితమైన పోస్టులు పెడితే.. చర్యలు తప్పవని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను ఎవరూ నమ్మవద్దని సూచించారు.

టెన్త్ ప్రశ్నపత్రం లీక్‌పై గోప్యంగా విచారణ

నకిరేకల్, శాలిగౌరారం : పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పరీక్షలు ప్రారంభమైన 15 నిముషాలకే తెలుగు ప్రశ్నపత్రం లీకైంది. లీకైన ప్రశ్నాపత్రం ఏకంగా శాలిగౌరారానికి చెందిన పలువురి యువకుల వ్యక్తిగత వాట్సాప్‌లలో చక్కర్లు కొట్టడంతో యువకులు ఆ ప్రశ్నపత్రంలోని ప్రశ్నలకు సంబంధించిన జవాబులను టెస్ట్‌పేపర్‌లోని నుంచి చించి వాటిని ఒకే పేపర్‌లో వచ్చేవిధంగా జిరాక్స్‌లు తీసి స్థానిక పరీక్ష కేంద్రాల్లోకి పంపించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద హల్‌చల్ చేశారు. టెన్త్ తెలుగు పేపర్ లీకైన విషయం శాలిగౌరారంలో వెలుగులోకి రావడంతో అధికారులు మండలకేంద్రంలోని పరీక్ష కేంద్రాలకు చేరుకుని ప్రశ్నాపత్రం లీకైన సంఘటనపై గోప్యంగా విచారణ జరిపారు. మండలకేంద్రంలోని పరీక్ష కేంద్రాలకు నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి, శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, తహశీసీల్దార్ యాదగిరి, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, ఎంఈఓ సైదులు చేరుకొని విచారణ జరిపారు. అనంతరం నకిరేకల్‌కు చేరుకొని నకిరేకల్‌లోని గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రాన్ని నల్లగొండ ఆర్డీఓతో పాటు డీఈఓ భిక్షపతి, తహసీల్దార్ జమురుద్దీన్, ఎంఈఓ నాగయ్య విచారణ జరిపారు. గుర్తుతెలియని వ్యక్తి వచ్చి పరీక్ష కేంద్రంలోని విద్యార్థిని నుంచి ప్రశ్నపత్రం ఫొటో తీసుకొని వెళ్లినట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. దీంతో అక్కడ విధుల్లో ఉన్న ముగ్గురు ఇనిజిలేటర్లను విధుల్లోనుంచి రిలీవ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు అధికారులు, సిబ్బందిపై విద్యాశాఖ చర్యలు చేపట్టింది. చీఫ్ సూపరింటెండెంట్‌ను, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌ను పరీక్ష విధుల నుంచి తొలగించింది. ఒక ఇన్విజిలేటర్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిసింది.



శాలిగౌరారంలోని ఓ కేంద్రంలో విచారణ జరిపి బయటకు వెళ్తున్న ఆర్డీఓ

45 నిమిషాలు ఆలస్యంగా విద్యార్థులు బయటకు..

పరీక్ష సమయం 12.30 గంటలకు ముగిసినప్పటికీ అధికారులు శాలిగౌరారంలోని పరీక్ష కేంద్రాల్లో ప్రశ్నాపత్రం లీకైన సంఘటనపై విచారణ జరుపడంతో 1.15 గంటలకు విద్యార్థులను బయటికి పంపారు. లీకైన పేపర్ ఫొటోతో పరీక్ష కేంద్రాల్లో క్షుణ్ణంగా విచారణ జరిపారు. వాట్సప్‌లో లీకైన పేపర్ సీరియల్ నెంబర్‌ను, మండల కేంద్రంలోని పరీక్ష కేంద్రాల్లోని పేపర్ సీరియల్ నంబర్లను సరి చూశారు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసిన తర్వాతా ఉన్నతాధికారుల ఆదేశంతో విద్యార్థులను బయటకు పంపిచారు.

ధాన్యం సేకరణకు సిద్ధం కావాలి

- అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్

నల్లగొండ : యాసంగిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అంతా సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈఓలు, చైర్మన్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రణాళికాబద్ధంగా యాసంగి ధాన్యం సేకరణ చేపట్టాలని సన్న, దొడ్డు ధాన్యానికి వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్న విషయాన్ని రైతులకు తెలియజేయాలన్నారు. ధాన్యం అమ్మిన రైతులకు 48 గంటల్లో డబ్బులు వారి బ్యాంకు ఖాతాలో జమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, జిల్లా సహకార అధికారి పత్యానాయక్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, జిల్లా మార్కెటింగ్ అధికారి ఛాయాదేవి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట వీఓఏల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న వీఓఏలు, సీఐటీయూ నాయకులు

నల్లగొండ టౌన్ : ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.20 వేల వేతనం అమలు చేయాలని వీఓఏల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. వివిధ కారణాలతో తొలగించిన వీఓఏలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో చిలుముల దుర్గయ్య, సులోచన, పోలె సత్యనారాయణ, కె.చంద్రకళ, మంగమ్మ, సువర్ణ, నగేష్, సురేష్, సైదమ్మ, పుష్పలత, పాపయ్య, లక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

చెత్త వేయకుండా.. కొత్త ఆలోచన

రోడ్ల వెంట చెత్త వేసే ప్రాంతాల్లో.. మొక్కలు, ముగ్గులు



నల్లగొండలో రోడ్డు వెంట మొక్కలు నాటి ముగ్గులు వేసిన మున్సిపల్ సిబ్బంది

నల్లగొండ టూటౌన్ : రోడ్ల వెంట ఎక్కడపడితే చెత్త వేయకుండా నీలగిరి మున్సిపల్ అధికారులు వినూత్న ఆలోచన చేశారు. చెత్త వేస్తున్న రోడ్లను గుర్తించిన మున్సిపల్ సిబ్బంది, ఉద్యోగులు అక్కడ మొక్కలు నాటి నీళ్లు పోసి వాటిని పెంచుతున్నారు. మొక్కల చుట్టూ టైర్లు అమర్చడం, అక్కడ ముగ్గులు వేసి అందంగా తీర్చిదిద్దడంతో చెత్త వేయకుండా నివారించే ప్రయత్నం చేస్తున్నారు.

కాలనీల్లోనూ మొక్కలు నాటడం మేలు..

నీలగిరి పట్టణ పరిధిలోని కొన్ని కాలనీల్లో చెత్తను రోడ్ల వెంట, జనవాసాల మధ్య వేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పట్టణంలోని అలాంటి ప్రాంతాలను గుర్తించి అక్కడ కూడా మొక్కలు నాటి వాటి చుట్టూ టైర్లు పెట్టి ముగ్గులు వేయడం ద్వారా చూడడానికి అందంగా కనిపిస్తుంది. ప్రజలు కూడా చైతన్యం అయి అక్కడ చెత్త వేయడానికి ఎవరూ సాహసించరు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ఈ విధానానికి శ్రీకారం చుట్టాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

బీబీనగర్ తహసీల్దార్ సస్పెన్షన్

బీబీనగర్: క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా.. ఖాళీ స్థలానికి పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేసిన తహసీల్దార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. బీబీనగర్ మండలం పడమటిసోమారం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 242, 254ల మధ్యలో గల కొన్ని సర్వే నంబర్లకు చెందిన భూములను కొన్నేళ్ల క్రితం ఓ రియల్ ఎస్టేట్ సంస్థ స్థానికుల నుంచి కొనుగోలు చేసింది. ఆ భూములను వెంచర్లు చేసి ప్లాట్లు విక్రయించింది. భూములను ఆ సంస్థ మ్యూటేషన్ చేసుకోలేదు. ఆ స్థలంపై కన్నేసిన కొందరు నాయకులు రియల్ ఎస్టేట్‌కు సంస్థకు భూములు విక్రయించిన వారిని ప్రలోభపెట్టారు. కొంత డబ్బు ముట్టజెప్పి మరలా ఆ భూములను వారి పేరున మార్చేందుకు దరఖాస్తు చేయించారు. పట్టాదారు పాస్ పుస్తకాలు రావడంతో.. వెంచర్లలోని కొంతభాగంలో ఉన్న ప్లాట్లను చెడగొట్టి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న రియల్ ఎస్టేట్ సంస్థ యాజమాన్యం ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా విచారణకు ఆదేశించారు. తహసీల్దార్ క్షేత్రస్థాయికి వెళ్లి భూములను పరిశీలించకుండానే పాస్‌పుస్తకాలు జారీచేసినట్లు విచారణలో తేలింది. అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం తహసీల్దార్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

టెన్త్ పరీక్షలకు 40 మంది గైర్హాజరు

- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : పదో తరగతి పరీక్ష శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 105 పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం జరిగిన తెలుగు పరీక్షకు 18,511 మంది విద్యార్థులకుగాను 18,471 మంది పరీక్షకు హాజరయ్యారు. 40 మంది గైర్హాజరయ్యారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి నల్లగొండ, గుర్రంపోడు తదితర ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. డీఈఓ, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్లతో మాట్లాడి పరీక్షకు హాజరైన విద్యార్థులు, ఏర్పాట్ల వివరాలను తెలుసుకున్నారు. ఆమె వెంట డీఈఓ భిక్షపతి తదితరులు ఉన్నారు.



నల్లగొండలో పరీక్ష నిర్వహణ తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది



నల్లగొండలో హాల్ టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

క్లుప్తంగా

వచ్చే నెల 8న సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్ర

భువనగిరి: ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్యాకేజీతో సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్ర వచ్చే నెల 8న ప్రారంభమవుతుందని సికింద్రాబాద్ ఐఆర్‌సీటీసీ సికింద్రాబాద్ అధికారులు కిషోర్, మార్కెటింగ్ ఇన్‌చార్జ్ నరేష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 8న ప్రారంభమయ్యే దర్శన యాత్ర ఉజ్జయిని మహాకాళేశ్వర్, ద్వారకా నాగేశ్వర్, సోమనాథ్, భీమాశంకర్, త్రయంబకేశ్వర్, గృశ్నేశ్వర్ జ్యోతిర్లింగాల దర్శనం అనంతరం 18న తిరిగి ప్రయాణం జరుగుతుందని తెలిపారు. యాత్రలో అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, రవాణా హోటల్ గదులు, ట్రావెల్ ఇన్సూరెన్స్‌తో పాటు ప్రతి కోచ్‌లో సెక్యూరిటీ గార్డ్ అందుబాటులో ఉండనున్నట్లు పేర్కొన్నారు. నాన్ ఏసీ స్లీపర్ టికెట్ ధర రూ. 20,980, త్రిఏసీ రూ.33,735, 2ఏసీ రూ.44,375 ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 97013 60701, 92810 30711 సెల్‌ఫోన్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

మునగాల: మండలంలోని ముకుందాపురం శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మునగాల మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన దాసరి సంజయ్ తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి కోదాడ వైపు వెళ్తుండగా మార్గమధ్యలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడడంతో స్థానికులు చికిత్స నిమిత్తం 108వాహనంలో కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆస్పత్రికి చేరుకున్న కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం పట్టణానికి తరలించారు. కాగా.. సంజయ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

అక్రమంగా తరలిస్తున్న ఆవుల పట్టివేత

చౌటుప్పల్ రూరల్: అక్రమంగా తరలిస్తున్న ఆవులను శుక్రవారం చౌటుప్పల్ మండలంలోని ఎల్లంబావి గ్రామ స్టేజీ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా తుని సంతలో కొనుగోలు చేసిన ఆరు ఆవులను గూడ్స్ ఆటోలో హైదరాబాద్‌లోని కబేళాకు తరలిస్తున్నారు. ఎల్లంబావి గ్రామ సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన ఆవులను జియాగూడలోని గోశాలకు తరలించినట్లు ఎస్సై యాదవరెడ్డి తెలిపారు.

చిట్యాలలో 20 పశువుల పట్టివేత

చిట్యాల: చిట్యాల పట్టణ శివారులోని ఉరుమడ్ల రోడ్డులో వధించిన గో మాంసంతోపాటు, 20 పశువులను శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చిట్యాల ఎస్‌ఐ ఎస్.ధర్మా తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ శివారులోని ఉరుమడ్ల రోడ్డుకు వెళ్లే దారిలో గోవధ చేస్తున్నట్లు సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. సుమారుగా అక్కడ ఉన్న 20 పశువుల్లో 7 ఆవులు, 9 దూడెలు, 3 ఎద్దులు, గేదె ఉన్నట్లు గుర్తించారు. అంతేకాకుండా అప్పటికే వధించిన గోమాంసాన్ని పోలీసులు గుర్తించి, పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. స్వాధీనం చేసుకున్న 20 పశువులను చండూరులోని గోశాలకు తరలించారు. గోవధతోపాటు, పశువులను నిర్బంధించిన చిట్యాల పట్టణానికి చెందిన మహ్మమద్ షరీఫ్, మహమ్మద్ సుల్తాన్, కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన ఎండీ సమీరుద్దీన్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రామాలయంలో చోరీ


ఉపేందర్‌రెడ్డి ఇంట్లో పగులకొట్టిన బీరువాను పరిశీలిస్తున్న క్లూస్‌టీం

- రూ.1.20లక్షల వెండి సామగ్రి అపహరణ
- కోటినాయక్ తండాలోని ఇంట్లో 3తులాల బంగారం 10వేల నగదు చోరీ

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట): మండల పరిధిలోని నెమ్మికల్ శ్రీసీతారామ ఆలయంలో, కోటినాయక్ తండాలోని ఓ వ్యక్తి ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు శ్రీసీతారామ ఆలయంలోని గర్భగుడి తలుపులు పగులగొట్టి హనుమాన్ వెండి విగ్రహం, కిరీటం మరికొన్ని వెండి వస్తువులను అపహరించారు. వీటి విలువ సుమారు రూ.1.20లక్షలు ఉండవచ్చని స్థానికులు పేర్కొన్నారు. అదేవిధంగా కోటినాయక్ తండాలోని కోమటి రెడ్డి ఉపేందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోని బీరువా తాళం పగలకొట్టి 3 తులాల బంగారం, రూ.10వేల నగదు అపహరించారు. ఉపేందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని పోలీసులు క్లూజ్ టీంతో పరిశీలించారు. రెండు చోరీ ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

మామిండ్లమడవలో బంగారం, నగదు చోరీ

మద్దిరాల: మండల పరిధిలోని మామిండ్లమడవ గ్రామంలో శుక్రవారం ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగవెల్లి నర్సయ్య మక్తా కొత్తగూడెంలోని తన కూతురు ఇంటికి రెండురోజుల క్రితం వెళ్లాడు. శుక్రవారం వచ్చి చూడగా ఇంట్లోని 13గ్రాముల బంగారం, 18తులాల వెండి, రూ.11వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. ఈ ఘటనపై ఎలాంటి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పోచంపల్లిలో ఫ్యాషన్ డిజైనింగ్ విద్యార్థులు


గ్రాఫ్ డిజైనింగ్ విధానాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లిలో శుక్రవారం ఫ్యాషన్ డిజైనింగ్ విద్యార్థులు సందడి చేశారు. ఇండస్ట్రియల్ టూర్‌లో భాగంగా హైదరాబాద్‌లోని జెడీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీకి చెందిన 120 మంది విద్యార్థుల బృందం పోచంపల్లిలోని కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్, శ్రీరంజన్ సిల్క్ యూనిట్, టూరిజం పార్కును సందర్శించారు. నూలు, రంగులద్దకం, చిటికి కట్టడం, వార్పు, మగ్గాలపై తయారవుతున్న చేనేత వస్త్రాలను పరిశీలించారు. పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల ప్రాముఖ్యత, చేనేత కళాకారుల నైపుణ్యాలను అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఓడీ దిశ మాట్లాడుతూ.. కోర్సులో భాగంగా క్షేత్ర స్థాయిలో చేనేత విధానాన్ని స్వయంగా తెలుసుకునేందుకు వచ్చినట్లు తెలిపారు. ప్రత్యక్షంగా చూడటం వల్ల విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన ఏర్పడుతుందని చెప్పారు. వీరివెంట ఫ్యాకల్టీ అబ్దులం విద్యాసాగర్, శ్వేత, హేమ తదితరులున్నారు.

రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని వ్యక్తి మృతి

నకిరేకల్: రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన నకిరేకల్ పట్టణంలోని పద్మానగర్ జంక్షన్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ సాగీర్(69) కుమార్తె, అల్లుడు నకిరేకల్‌లోని పద్మానగర్ జంక్షన్ వద్ద టైర్ల పంక్చర్ల షాపు పెట్టుకుని జీవన సాగిస్తున్నారు. సాగీర్ కూడా తన బిడ్డ దగ్గరే ఉంటూ వారికి తోడ్పాటునందిస్తున్నాడు. రోజు మాదిరిగా ఉదయం 10 గంటల సమయంలో మహ్మద్ సాగీర్ పంక్చర్ షాపు వద్దకు వెళ్తుండగా.. పద్మానగర్ జంక్షన్‌వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు ఈయనను ఢీకొట్టింది. ఈప్రమాదంలో సాగీర్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు భార్య బీహార్‌లో ఉంటుంది. మృతుడి కుమార్తె మసరత్ ఫర్వీన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

రియల్‌ఎస్టేట్ సంస్థపై కేసు నమోదు

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం తుప్రాన్‌పేట గ్రామంలో ప్రభుత్వ భూమిని తమ లేఅవుట్‌లో చూపించి ప్లాట్లు అమ్ముతున్న ఓ ప్రముఖ రియల్‌ఎస్టేట్ సంస్థపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ వివరాలు వెల్లడించారు. గతంలో ఓ రియల్ ఎస్టేట్ 1991 డీటీసీపీ లేఅవుట్ చేసి ప్రభుత్వ భూమిని కూడా వెంచర్ లేఅవుట్‌లో చూపించిదని, ప్రస్తుతం ఇదే వెంచర్‌ను మరో సంస్థ సంస్థ డెవలప్ చేసి ప్రభుత్వ భూమిని లేఅవుట్‌లో చూపించి ప్లాట్లు విక్రయిస్తోందని, దీనిపై చౌటుప్పల్ తహసీల్దార్ హరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

లైంగిక వేధింపుల కేసులో ఇద్దరు అరెస్ట్


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్: యువతిని లైంగికంగా వేధించిన కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. మరొకరు పరారీలో ఉన్నారు. శుక్రవారం సీఐ చరమంద రాజు ఎస్‌ఐ ముత్తయ్యతో కలిసి పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడించారు. హుజూర్‌నగర్‌లోని స్వామి రోజా, ఆమె ప్రియుడు నూకతొట్టి ప్రమోద్ కుమార్, మరొక వ్యక్తి లచ్చిమళ్ల హరీష్ కలిసి ఈనెల 18న ఒక యువతిని బలవంతంగా కారులో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ ప్రమోద్, హరీష్‌లు యువతిని లైంగికంగా వేధించారు. వారి నుంచి తప్పించుకున్న ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితులైన నూకతోట్టి ప్రమోద్ కుమార్, స్వామి రోజాను పట్టణంలో వారు తమ ఇంట్లో ఉండగా అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారిని అరెస్ట్ చేసి కారు, రెండు సెల్ ఫోన్లు, ఒక బాండ్ పేపర్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు లచ్చిమళ్ల హరీష్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. ప్రమోద్ కుమార్‌పై హుజూర్‌నగర్, మఠంపల్లి, గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌లో నాలుగు కేసులు నమోదైనట్లు తెలిపారు. సమావేశంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనాలు ఢీకొని ఇద్దరు మృతి

దేవరకొండ: గుర్తు తెలియని వాహనాలు ఢీకొని ఇద్దరు మృతి చెందారు. దేవరకొండ, కొండమల్లేపల్లి మండలాల్లో జరిగిన ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. దేవరకొండ మండల పరిధిలోని గొట్టిముక్కల గ్రామపంచాయతీ బద్యానాయక్ తండాకు చెందిన నేనావత్ చిరంజీవి(23) హైదరాబాద్‌లో ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల గ్రామానికి వచ్చిన చిరంజీవి గురువారం రాత్రి ద్విచక్ర వాహనంపై దేవరకొండ నుంచి స్వగ్రామమైన బద్యానాయక్ తండాకు వెళ్తున్నాడు. ఈక్రమంలో కల్వకుర్తి నుంచి దేవరకొండ వైపు వస్తున్న గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన చిరంజీవి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహులు తెలిపారు.

కొండమల్లేపల్లిలో..


శ్రీనయ్య (ఫైల్)

కొండమల్లేపల్లి: పెద్దఅడిశర్లపల్లి మండలంలోని మల్లాపురం గ్రామానికి చెందిన నారాయణదాసు శ్రీనయ్య (53) కొండమల్లేపల్లి పట్టణంలోని విద్యుత్ కేంద్రంలో లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధులు ముగించుకొని తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. మండలంలోని కొల్‌ముంతలపహాడ్ గేటు సమీపంలో యూటర్న్ తీసుకునే క్రమంలో దేవరకొండ నుంచి కొండమల్లేపల్లి వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రమైన గాయాలు కావడంతో శ్రీనయ్యను చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించి కొండమల్లేపల్లి ఏఈ దేవుజ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను సక్సెస్ చేయాలి

- ఉమ్మడి జిల్లా నుంచి పార్టీ శ్రేణులను తరలించాలని మాజీ సీఎం కేసీఆర్ సూచన
- ఎర్రవెల్లి ఫాం హౌస్‌లో ఆయనను కలిసిన బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు


మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన జగదీశ్‌రెడ్డి, గొంగిడి సునీత, పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్

సాక్షి, యాదాద్రి: హన్మకొండలో వచ్చే నెలలో జరిగే బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి పార్టీ శ్రేణులను పెద్దఎత్తున తరలించాలని ఆ పార్టీ అధినేత కేసీఆర్ మాజీ ఎమ్మెల్యేలకు సూచించారు. శుక్రవారం ఎర్రవెల్లిలోని ఫాం హౌస్‌లో కేసీఆర్‌ను సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, ఆలేరు, భువనగిరి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్‌లు కలిశారు. ఈసందర్భంగా హన్మకొండకు దగ్గరలో ఉన్న జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి భారీగా జన సమీకరణ కోసం చర్చించారు. నియోజకవర్గాల వారీగా చేపట్టే జన సమీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై కేసీఆర్ వారికి దిశా నిర్దేశం చేశారు. వేడుకలకు ఆలేరు, భువనగిరి, తుంగతుర్తి నియోజకవర్గాల నుంచి పదివేల మంది వరకు పార్టీ శ్రేణులను తరలివస్తారని కేసీఆర్‌కు వివరించారు.

లారీ దగ్ధం


దగ్ధమవుతున్న లారీ

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం తుప్రాన్‌పేట గ్రామ శివారులో మంటలు అంటుకుని లారీ దగ్ధమైంది. గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీ తుప్రాన్ పేట గ్రామ శివారులోకి రాగానే లారీ డ్రైవర్ వంట చేసుకోవడానికి క్యాబిన్‌లో గ్యాస్ సిలిండర్ స్టౌవ్‌ను వెలిగించాడు. గ్యాస్ లీక్ కావడంతో మంటలు క్యాబిన్‌కు వ్యాపించాయి. డ్రైవర్ లింగస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదవరెడ్డి తెలిపారు.

పరీక్షా సమయంలో తెరిచి ఉంచిన జీరాక్స్ సెంటర్లు



పరీక్షా కేంద్రం సమీపంలో తెరిచి ఉంచిన జీరాక్స్ సెంటర్లు

- ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు

శాలిగౌరారం: శాలిగౌరారం మండల కేంద్రంలో శుక్రవారం పదో తరగతి పరీక్షా సమయంలో జీరాక్స్ సెంటర్లు, మీసేవా కేంద్రాలు తెరిచే ఉన్నాయి. విద్యార్థులు పరీక్ష రాస్తున్న సమయంలో సమీపంలో 144 సెక్షన్ అమలు ఉంటుంది. కానీ అవేమీ పట్టించుకోకుండా జీరాక్స్ సెంటర్ల నిర్వాహకులు షాపులను తెరిచే ఉంచారు. పోలీసులు ఇవేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా.. లీక్ అయిన ప్రశ్నపత్రం వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టడంతో శాలిగౌరారానికి చెందిన కొంత మంది యువకులు సమీపంలోని జీరాక్స్ సెంటర్లలో జవాబు పత్రాలను జీరాక్స్ తీసుకుని పరీక్షా కేంద్రంలోనికి పంపించేందుకు తీవ్రంగా యత్నించినట్లు స్థానికులు పేర్కొన్నారు.

ఎంజీయూలో భౌతిక శాస్త్ర ప్రయోగశాల ప్రారంభం

- ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ ఖాజా ఆల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో భౌతిక శాస్త్ర ప్రయోగశాలను శుక్రవారం వైస్ చాన్స్‌లర్ ఖాజా ఆల్తాఫ్ హుస్సేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భౌతిక శాస్త్రం విభాగంలో మెరుగైన పరిశోధనలకు అనుగుణంగా ల్యాబ్‌ను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రపంచానికి ప్రయోజనం చేకూరే నాణ్యమైన పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు ఆ దిశగా తమ ప్రయత్నాలు చేసి సఫలీకృతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమ్‌సాగర్, సైన్స్ డీన్ ప్రొఫెసర్ వసంత, సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కొప్పుల అంజిరెడ్డి, డాక్టర్ కొప్పుల సత్తిరెడ్డి, భిక్షమయ్య, రమేష్, డాక్టర్ శాంతకుమారి, ఆదిరెడ్డి, వీరస్వామి, రూప తదితరులు పాల్గొన్నారు.


ప్రయోగశాలను ప్రారంభిస్తున్న వీసీ ఖాజా ఆల్తాఫ్ హుస్సేన్

నెత్తిన బండరాళ్లతో దివ్యాంగుల నిరసన


నెత్తిపై బండరాళ్లు పెట్టుకుని నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

ఆత్మకూర్(ఎస్): బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమానికి నిధులు కేటాయించలేదని నిరసిస్తూ శుక్రవారం ఆత్మకూర్ (ఎస్) మండలం కందగట్ల గ్రామంలో భారత వికలాంగుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పలువురు దివ్యాంగులు బండరాళ్లను నెత్తిన పెట్టుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్ద రాజేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 30 లక్షల మంది అంగవైకల్యంతో బాధపడుతున్నారని, వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. దివ్యాంగులకు రూ.6000 పెన్షన్ ఇస్తామని, ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చెప్పి నేటికీ అమలు చేయలేదన్నారు. నిరసన కార్యక్రమంలో గోగుల శేఖర్‌రెడ్డి, గుడిపల్లి సుమతి, తలారి సహదేవుడు, ఆకారపు వెంకన్న, వంటిపాక ముత్తయ్య, ఆరూరి బాబు, మేకల వెంకన్న, గుమ్మడవెల్లి ఆంజనేయులు, లింగయ్య, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

పాలకవీడు: మండల పరిధిలోని గుడుగుంట్లపాలెం గ్రామంలో శుక్రవారం పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై లక్ష్మీనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గుడుగుంట్లపాలెం గ్రామంలో ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడిచేసినట్లు తెలిపారు. ఈమేరకు వారి నుంచి రూ.11,300 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గంజాయి కేసులో నిందితుడికి రిమాండ్

చౌటుప్పల్ రూరల్: ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్న ముఠాను చౌటుప్పల్ పోలీసులు ఈ నెల 15న చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్నారు. అందులో ఒకరు పరారీలో ఉండగా శుక్రవారం పోలీసులు అతడిని పట్టుకుని అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని పాతబస్తీకి చెందిన మహ్మద్ జావేద్(52) గా గుర్తించినట్లు ఎస్సై యాదగిరి తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి తీవ్రగాయాలు

చిలుకూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున చిలుకూరు మండలంలోని సీతారాంపురం వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామానికి చెందిన సంపంగి భాస్కర్ పనినిమిత్తం కోదాడ నుంచి హుజూర్‌నగర్ వైపు వెళ్తున్న క్రమంలో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. అతడి తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108లో హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్ తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురభి రాంబాబు గౌడ్ తెలిపారు.

పుచ్చసాగు – యాజమాన్య పద్ధతులు

- ప్రాంతీయ ఉద్యానవనశాఖాధికారి సూచనలు



గుర్రంపోడు: జిల్లాలో పుచ్చసాగు ఏటేటా గణనీయంగా పెరుగుతోంది. యాసంగిలో ఆరుతడిగాను, పండ్ల తోటల్లో అంతర పంటగానూ పుచ్చను విరివిగా సాగుచేస్తున్నారు. ప్రస్తుతం దిగుబడులు వచ్చే దశలో ఉన్నాయి. ఈ సమయంలో పుచ్చసాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చని ఉద్యానవనశాఖ అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా నీటి యాజమాన్యం, తీగల కత్తిరింపులు, కాయల సంరక్షణ, పక్వత లక్షణాలు గుర్తించడంపై ప్రాంతీయ ఉద్యానవనశాఖాధికారి మురళి అందిస్తున్న సలహాలు.

నీటి యాజమాన్యం

సరైన మోతాదులో నీటిని అందించాలి. నేల స్వభావం, వాతావరణ పరిస్థితులను బట్టి 4–5 రోజులకొకసారి నీరందించాలి. తేలికపాటి నేలల్లో తరుచుగా నీటిని అందించాలి. డ్రిప్ పద్ధతిలో ప్రతిరోజూ లేదా రోజు విడిచి రోజు సరిపడినంత నీరు అందించాలి. మల్చింగ్ ద్వారా పుచ్చసాగు వల్ల నీటి తేమ తొందరగా ఆవిరి కాకుండా ఉండటమేగాక కలుపు సమస్య తగ్గి 30శాతం మేరకు అధిక దిగుబడులు సాధించవచ్చు. పిందె ఏర్పడిన తర్వాత కాయ అభివృద్ధి చెందే దశ వరకు సమృద్ధిగా నీరు పారించాలి. తేమ పూర్తిగా తగ్గిపోయిన తర్వాత నీటిని పారించడం వల్ల పక్వానికి వచ్చిన కాయలు పగిలిపోయే ప్రమాదం ఉంది. ఈ దశలో నీటి హెచ్చుతగ్గులు లేకుండా, నీటి ఎద్దడికి గురికాకుండా జాగ్రత్త వహించాలి. కాయలు కోత పరిమాణం సంతరించుకున్న తర్వాత అధిక నీరు అందిస్తే కాయలు పగిలిపోయే ప్రమాదం ఉంది.

తీగల కత్తిరింపులు

కాలువ నీరు తాకితే బూజు తెగులు సోకుతుంది. కావున సాగునీటికి దూరంగా తీగను పాకించాలి. పూతకు ముందు తీగ చివర్లను తుంచివేయాలి. ఒక్కో తీగకు 3 నుంచి 4 పక్క తీగలను ఉంచి మిగతా వాటిని తొలగించడం వల్ల నాణ్యత, దిగుబడి పెరుగుతుంది. తీగల చివరన ఉన్న తామర పురుగులు, కాయతొలుచు పురుగుల గుడ్లు, చిన్న లద్దె పురుగులు నివారించబడతాయి.

కాయల సంరక్షణ

పుచ్చకాయలు నేలను తాకిన చోట పసుపు రంగులో మచ్చ ఏర్పడుతుంది. ఈ మచ్చ ఏర్పడితే మంచి పరిమాణంలో ఉన్నప్పటికీ మార్కెట్‌లో ధర పలకదు. దీన్ని అరికట్టేందుకు రైతులు తరుచు కాయలను కదుపుతూ ఉంటారు. కాయలు నేలను అంటిన కింది భాగంలో థర్మాకోల్ ముక్కలు లేదా వరిగడ్డిని ఉంచితే మచ్చ ఏర్పడదు. మల్చింగ్ చేయడం ద్వారా కూడా నివారించవచ్చు. పిందెలు ఏర్పడే దశలో లీటరు నీటికి 5 గ్రాముల మల్టికే కలిపి పిచికారీ చేయాలి. దీనికితోడు తీగకు ఒకటి, మొక్కకు రెండు కాయలు మాత్రమే ఉంచి మిగతా పిందెలు తొలగించాలి. దీని వల్ల కాయపరిమాణం పెరిగి మార్కెట్‌లో మంచి నాణ్యమైన పండ్లుగా అధిక ధర లభిస్తుంది.

కాయపగలడం

సాగునీటి పారుదలలో హెచ్చుతగ్గుల వల్ల, బోరాన్ ధాతువు లోపం వల్ల కాయపగలడం జరుగుతుంది. నీటి తడులిచ్చే సమయంలో ఒడిదుడుకులు లేకుండా పొలంలో తగినంత తేమ ఉండేలా శ్రద్ధ వహించాలి. బోరాన్ లోపాన్ని సవరించేందుకు లీటరు నీటికి ఒక గ్రామ్ బోరాన్‌ను పిందెలు ఒకటి, రెండు పరిమాణంలో ఉన్నప్పుడు ఒకసారి, వారం రోజుల తర్వాత రెండోసారి పిచికారీ చేయాలి.

వంకర కాయలు

మొక్కలకు తగినంత పోషకాలు లభించక ఫలదీకరణ సరిగా జరగక పోవడం, వైరస్ తెగుళ్ల సోకటం వల్ల కాయల ఆకారం కోల్పోయి వంకరగా మారుతాయి. దీని నివారణకు సిఫారసు చేసిన మోతాదు మేరకు ఎరువుల యాజమాన్యం పాటించాలి.

పక్వత గుర్తించడం ఇలా..

పక్వ దశను గుర్తించడానికి రైతులు, వ్యాపారస్తులు వేళ్లతో కాయలను కొట్టినప్పుడు వచ్చే శబ్దం ఆధారంగా నిర్ధారిస్తారు. కాయలను కొట్టినప్పుడు వచ్చే శబ్దం తల నొసటిపై కొడితే వచ్చే శబ్దంలా ఉంటే లేత కాయగా, ఎదరొమ్ముపై కొడితే శబ్దంలా ఉంటే పక్వానికి వచ్చిన కాయగా, కడుపుపై కొడితే వచ్చే శబ్దంలా ఉంటే పక్వదశ దాటి పండుబారి కోత ఆలస్యమైనట్లుగా గుర్తిస్తారు. శబ్దం ఆధారంగా కాకుండా కాయలు నేలను తాకిన భాగంలో ఏర్పడే నేల మచ్చ, కాయ పక్కలోని వడలిపోయిన తీగ, పుచ్చపై తోలు వేళ్ల ఒత్తిడికి సులభంగా గురవడం ఫలదీకరణ చెందిన (30–40 రోజులు) తర్వాత నిర్ణీత రోజులు అనే లక్షణాలు పరిగణలోకి తీసుకుని పుచ్చకాయలు పక్వం చెందినట్లు గుర్తించవచ్చు.